# మాతృదేవత

వసుంధర

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

అమ్మంటే నాకు గౌరవమని చెప్పుకునేందుకు సిగ్గు పడుతున్నాను. ఉమేష్ మాతృభూమి గురించి తెలిసాక!

ఉమేష్ తల్లి జగదాంబ అమ్మకు దూరపు బంధువు. జగదాంబకు చిన్నతనంలోనే భర్తపోతే అయినవాళ్లెవరూ ఆదుకోలేదు. కూడూ, గుడ్డకోసం వంటపని చేసుకుంటున్న ఆమెపై అమ్మ జాలిపడితే మా ఇంట్లో నీడ ఇవ్వడానికి నాన్న ఒప్పుకున్నాడు. ఆ కృతజ్ఞతతో జగదాంబ వీలు చేసుకునీ మరీ అమ్మకు అన్ని పనుల్లోనూ సాయం చేసేది.

ఉమేష్ స్కూలు ఫీజులు. పుస్తకాల ఖర్చులు మేమే భరించేవాళ్లం. వాడు చాలా బాగా చదివేవాడు. క్లాసులో అన్ని సబ్జక్టుల్లోనూ వాడిదే ఫస్టు మార్కులు. వాడితో పోల్చి అమ్మా నాన్న నన్ను మందలిస్తుంటే నాకు వాడంటే అసూయ పుట్టినా-అది ద్వేషంగా మారలేకపోయింది. కారణం నమ్మినబంటులా ఉంటూ ఉమేష్ నామీద ఈగ కూడా వాలనిచ్చేవాడు కాదు. నేను వాడితో స్నేహభావం కొనసాగిస్తూ అది నా సంస్కారమని భ్రమపడేవాణ్ణి.

ఇంట్లో మేమిద్దరం కంబైండ్ స్టడీస్ చేసేవాళ్లం. టీచర్సు చెప్పాక కూడా నాకర్థంకాని కొన్ని పాఠ్య విశేషాలు-టీచర్సు చెప్పకముందే చదివి అర్థం చేసుకోగల ఉమేష్ తెలివి నాకు దిగ్భ్రాంతి కలిగించేది. "నీకింత తెలివి ఎలా వచ్చింది?" అనడిగానోరోజున.

"తెలివి నాది కాదు. అమ్మ మహిమ. నేను ప్రతిరోజూ నిద్ర లేవగానే అమ్మకు దణ్ణం పెట్టుకుంటాను. ఏ పని ప్రారంభించినా అమ్మనే ధ్యానిస్తాను. అమ్మ నాకు జన్మ నిచ్చిన దేవత. మనసారా పూజిస్తే జన్మ సార్థకమయ్యే ఫలితాలను వరంగా ఇస్తుందని నా నమ్మకం" అన్నాడు ఉమేష్.

ఆశ్చర్యపోయాను. నేను అమ్మను గౌరవిస్తాను కానీ దేవత అనుకోను. నాకు అమ్మ వేరు. దేవుడు వేరు. ఏమైనా కావాలంటే దేవుడికి దణ్ణం పెట్టుకుంటాను. అమ్మ దగ్గరైతే మారాం చేస్తాను తప్ప దణ్ణం పెట్టను. అమ్మకు దణ్ణం పెట్టానంటే ఆమె నాకేదో ఇచ్చిందని అర్థం. ఉదాహరణకు కొత్త బట్టలు.

"అమ్మను గౌరవించడం సంస్కారం. కానీ కనిపెంచే మనిషిని దేవత అనడం మూర్ఖత్వం" అన్నాను.

"కనిపించని దేవుళ్లని నమ్మే లోకంలో-కనిపెంచే మనిషిని-కనిపించే దేవత అనుకోవడం మూర్ఖత్వమౌతుందా?" అన్నాడు ఉమేష్. బదుల్విలేక, "నీకు టెన్తు దాటి చదవాలనుంది. కాలేజి చదువుకు పట్నం వెళ్లాలి. ఖర్చూ ఎక్కువే. మరి మీ అమ్మను వరమడిగేవా?" అన్నాను అట్నించి నరుక్కు వద్దామని.

యానుమేష్ నవ్వి, "దేవుళ్లూ, దేవతల ముందు మనం చేతులు జోడిస్తామే తప్ప నోరు విప్పం కదా! అమ్మ కూడా నాకు అడక్కుండానే వరమిస్తుంది" అంటే-వాడి నమ్మకానికి నవ్వుకున్నాను. కానీ మేము టెన్తు పరీక్షలు రాసేక-కొడుకు చదువుకోసం జగదాంబ మకాం విశాఖపట్నానికి మారిస్తే ఆశ్చర్యపోయాను.

అక్కడ ఓ దూరపు బంధువు సాయంతో మిఠాయి దుకాణం తెరుస్తానని ఆమె మావాళ్లకు చెప్పింది.

ఆ తర్వాత అమ్మకు జగదాంబనుంచి అప్పుడప్పుడు ఉత్తరాలొచ్చేవి. అమ్మ సంతోషించి ఊరు కునేది కానీ బదులిచ్చేది . కాదు. అందుకనేమో క్రమంగా జగదాంబ ఉత్తరాలు వ్రాయడం మానేసింది.అందువల్ల ఉమేష్ బీకాంలో చేరడంవరకే మాకు తెలుసు.

వారసత్వంగా సంక్రమించిన ఆస్తి ఉన్న నాకు చదువంటే ఆసక్తి లేకపోయినా-చెప్పుకునేందుకో డిగ్రీ ఉండాలని ఎలాగో బియ్యే అనిపించాను. ఉద్యోగం పురుష లక్షణమని-రిటెన్ టెస్టుల్లో కాస్త కష్టపడి ఓ ప్రైవేటు కంపెనిలో ఉద్యోగమూ సంపాదించాను.

ఎనభైమంది స్టాఫున్న మా ఆఫీసుకు చీఫ్ గంగారావు. ఆయనకింద పదిమంది ఆఫీసర్లు. ఆ తర్వాత వచ్చే ఇరవైమంది అసిస్టెంట్లలో సీనియారిటీ ప్రకారం నాది పన్నెండో పొజిషన్. ఐనా మా ఆఫీసులో నాకూ గంగారావుకూ సమాన గౌరవముంది. కారణం నేను ఆఫీసుకు స్వంతకార్లో వచ్చే ఏకైక వ్యక్తిని కావడం. ఆఫీసు కారు వేరే పనిలో ఉన్నప్పుడు నేను స్వంతకారు లేని గంగారావుకు లిఫ్టిచ్చిన సందర్భాలున్నాయి.

గంగారావిచ్చే గౌరవం ఆఫీసులో నా స్థాయిని పెంచింది. ఆఅనుభూతి ఎంత గొప్పదంటే ఒక్క రోజు కూడా ఆఫీసు మానడం నాకిష్టముండదు.

ఉద్యోగంలో చేరిన ఏడాదికి నాకు చంద్రికతో పెళ్లైంది. ఆమె చెప్పుకోతగ్గ అందగత్తె. చెప్పుకున్నా నమ్మకంత అనుకూలవతి. మూడేళ్లలో ఇద్దరు మనవళ్లనిచ్చి తన ముచ్చట తీర్చిందని మా అమ్మ కూడా ఆమెను తనకూ అనుకూలవతి అంటుంది. అలా అంతా నన్ను అదృష్టవంతుడంటే నిజమని నేనూ నమ్ముతాను. అదృష్టం చేజారకూడదనే దైవభక్తుణ్ణయ్యాను. రోజూ అరగంట జపం చేస్తాను. వారానికోసారి గుడికెళ్లి శ్రీకృష్ణున్ని దర్శిస్తాను. ఏడాదికోసారి తిరుపతి వెళ్లి హుండీలో దండిగా డబ్బులు వేస్తాను.

ఇన్ని చేసినా నేను భయపడ్డంతా అయింది. మా చీఫ్ గంగారావు ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. ఆయన స్థానంలో వచ్చే బాస్‌కి కారుంటుందేమోనని కలవరపడ్డాను కానీ అంతకంటే ఘోరం జరిగిపోయింది.



ఆఫీసులో జాయినైన రోజు మా కొత్త చీఫ్ స్టాఫందర్నీ పిలిచి తన్ను తాను పరిచయం చేసుకున్నాడు. అంతకుముందు అతడి పేరు ఉమేష్ అని తెలిసినా అతడు జగదాంబ కొడుకేనని అప్పుడే గుర్తించాను. ఒకప్పటి నా తొత్తు ఈ రోజు నాకు పై అధికారి అని తెలియడం నాకు చాలా పెద్ద షాక్! కారున్న బాసొచ్చినా నాకింత బాధుండేది కాదు. ఒకప్పుడు వాడు. వాళ్లమ్మ మాకాలికింద చెప్పులు. ఇప్పుడా చెప్పుల్ని నెత్తిన పెట్టుకుని మోయాలి. పువ్వులమ్మిన ఊళ్లో కట్టెలమ్మడం ఇదే ఐతే అదెంత బాధాకరమో నాకిప్పుడర్థమౌతోంది.

కొలీగ్సంతా ఒకొక్కరే పరిచయం చేసుకుంటుంటే-ఉమేష్ కరచాలనం చేస్తున్నాడు.

నావంతొచ్చేసరికి తలెత్తకుండానే పేరు చెప్పాను. ఉమేష్ కాస్త వంగి నా ముఖంలోకి చూసి, "అరే రఘూ-నువ్వా?" అన్నాడు ఆశ్చర్యంగా. క్షణంలో ఆ ఆశ్చర్యం సంతోషమై-అప్రయత్నంగా వాడు నన్ను కౌగిలించుకుని, "కలిసి చదివాం. కలిసి ఒకే కంపెనీలో పని చేస్తామని కలలో కూడా అనుకోలేదు. ఇది నా అదృష్టం" అన్నాడు. మిగతా స్టాఫుతో పరిచయాలయ్యాక నన్ను తన చాంబర్లోకి తీసుకెళ్లాడు.

వాడు ముందు తన గురించి చెప్పాడు. బీకాం చేస్తూ ఎంబియ్యే ఎంట్రెన్సుకి ప్రిపేరైతే ఐఐయం కాకపోయినా మంచి సంస్థలోనే సీటొచ్చింది. నెలకు ముప్పైవేలు జీతంమీద ఢిల్లీలో ఆర్నెల్లు పనిచేసాడు. అక్కడ నచ్చక కాస్త హెచ్చు జీతం మీద ముంబైకి మారితే అక్కడా నచ్చలేదు. జీతం కాస్త తక్కువైనా తెలుగు గడ్డమీద బ్రతకాలనిపించి ఇక్కడికొచ్చాడు.

"ఈ రోజుల్లో పెద్ద జీతాలకోసం చాలామంది దేశాన్నే విడిచి వెడుతున్నారు. నువ్వు తెలుగు గడ్డ కోసం ఢిల్లీ, ముంబైలను కాదని చిన్న జీతానికొప్పుకోడం చిత్రంగా ఉంది" అన్నాను అపనమ్మకంగా.

"ఏం చేయను? అమ్మ రాష్ట్రం విడచి రానంటుంది. తనింకా విశాఖపట్నంలోనే ఉంది" అన్నాడు ఉమేష్.

"మరిప్పుడు అమ్మ హైదరాబాదు కూడా రానంటే ఈ ఉద్యోగం వదిలి విశాఖపట్నంలో మరొకటి చూసుకుంటావా?" అన్నాను. నా గొంతులో ధ్వనించింది వ్యంగ్యం కాదు-ఆశ!

"స్వరాష్ట్రంలో ఎక్కడున్నా నా దగ్గరకొచ్చి ఉంటానని మాటిచ్చింది అమ్మ!" అన్నాడు ఉమేష్.

అప్పుడు వాడి కళ్లఓ మెరుపు చూస్తే-తల్లి విషయంలో వాడేమాత్రం మారలేదనిపించింది.

"అంటే-నువ్వు జీవితంలో పైకి రావడంకంటే తన దగ్గరుండడమే ముఖ్యమనుకుంది మీ అమ్మ! అందుకే అంటారు అదృష్టవంతుణ్ని చెరిపేవారూ, దురదృష్టవంతుణ్ని బాగు చేసేవారూ లేరని!" అంటూ నిట్టూర్చాడు.

" ఆ సామెత అక్షరాలా నిజం. అంత ఆస్తి ఉండి ఈ చిన్న ఉద్యోగం కోసం ఉన్న ఊరొదిలి పట్నానికొచ్చావు. నీ అదృష్టం నాకుంటేనా- ఇలా పొట్ట చేతపట్టుకుని ఊళ్లు తిరిగేవాణ్నే కాను" అన్నాడు ఉమేష్.

వాడు పరోక్షంగా నా అదృష్టాన్ని పొగిడాడని గ్రహించినా సంతోషం కలగలేదు. నాది చిన్న ఉద్యోగమన్న పదం మాత్రం ముల్లై గుచ్చుకోగా, "అంటే మనిద్దరికీ అదృష్టం లేదంటావు!"అన్నాను.

ఉమేష్ నవ్వి, "నా అభిప్రాయంలో అదృష్టం అందరికీ ఉంటుంది. దాన్ని గుర్తించినవాడు అదృష్టవంతులు. గుర్తించనివారు దురదృష్టవంతులు. ఇప్పుడు మన సంగతే తీసుకో-మనం కంపెనీ పేరు చెప్పి ఇకమీదట రోజూ ఒకర్నొకరు చూసుకోవచ్చు. కలిసి పనిచేయొచ్చు. ఎంత అదృష్టం!" అన్నాడు.

బాస్‌తో కలిసి పనిచేయడం అదృష్టమా-అదీ ఆ బాస్ ఒకప్పుడు నా తొత్తు అయినప్పుడు?

"అంటే ప్రస్తుతానికి ఆవిడకి అత్తపోరు లేదన్న మాట!" అంటూ మాట మార్చాను.

"అమ్మ నాకు జన్మనిచ్చింది. డిగ్రీ ఇచ్చింది. ఉద్యోగమిచ్చింది. ఇంకా భార్యనివ్వలేదు. మరి నీ సంగతి. చెప్పు" అన్నాడు.

క్లుప్తంగా మా ఇంటి విశేషాలు చెప్పాను.

"వెంటనే మీ ఆవిడకి ఫోన్ చేసి-నేను సాయంత్రం మీ ఇంటికొస్తున్నానని చెప్పు. నీ పిల్లల్ని చూడాలన్నది కుతూహలమైతే నీతో కలిసి భోంచేయాలన్నది తహతహ" అన్నాడు ఉమేష్ వెంటనే.



నన్ను నీరసం ఆవహించిండి. ఒకప్పుడు మా అసరాతో బ్రతికిన ఉమేష్ ఇప్పుడు నా పై అధికారిగా వస్తే-మనసులో చంద్రిక నన్నూ వాణ్ణీ పోల్చదూ? అప్పుడు ఉమేష్ పక్కన నా వ్యక్తిత్వం చిన్నబోయి ఆమెకు నాపై ఆరాధనాభావం తగ్గదూ? అలా జరక్కుండా ఆపాలంటే-నేను నా తెలివంతా ఉపయోగించి ఏదో చేయాలి. అందుకు కొంత టైము అవసరమనిపించి, "ఈ రోజు కాదు. మరో రోజు కలుద్దాం" అందామనుకునేలోగా- వాడు తన ముందున్న ఫోనుతీసి, "నంబరు చెప్పు. కలిపి ఇస్తాను" అన్నాడు.

అప్పుడు వాడు నాకు పై ఆఫీసరని గుర్తొచ్చింది. వాడేం చెప్పినా అది నాకు ఆర్డరౌ ఔతుంది మరి!

"ఇక్కణ్ణుంచొద్దు. నా సీట్లోంచి ఫోన్ చేస్తాను" అంటూ అక్కణ్ణుంచి లేచాను.

"ఒకసారి పరిచయమై కొత్త తగ్గాక-నీకు చెప్పదముండదు. అపాయింటు మెంట్లు నేనే ఫిక్సు చేస్తే ఆ తర్వాత నీ పిల్లలో, ఆవిడో నీకు చెబుతారు' అన్నాడు ఉమేష్. ఆఫీసులోనే కాదు. నా ఇంట్లోనూ వాడే నాకు బాస్ అవ్వదామనుకుంటున్నట్లు ధ్వనించగా సన్నగా నిట్టూర్చి-వాడి చాంబర్లోంచి బయటపడ్డాను.

నన్ను చూస్తూనే మిగతా కోలీగ్సు చుట్టుముట్టారు. "గంగారావు బదులు ఎవరొస్తారో. ఆఫీసులో నీ పొజిషనేమౌతుందోనని గాబరా పడ్డాం. అదృష్టమంటే నీదే! ఇప్పుడు నీ క్లాస్‌మేట్ మన బాసు. ఇక ఆఫీసులో నీదే రాజ్యం" అన్నారు వాళ్లు ఏకగ్రీవులై.

గతంలో వాళ్లు గుర్తించే అదృష్టం నన్నెంతగానో సంతోషపెట్టేది. ఇప్పుడదే గుర్తింపు నా అదృష్టాన్ని దెబ్బ తీయగా-అసంతృప్తిగా నవ్వి ఊరుకున్నాను. వాళ్లు వినకూడదని బాత్రూంకెళ్లి అక్కడ సెల్ తీసాను. చంద్రికకు విషయం చెప్పి, "ఉమేష్‌ది నడమంత్రపుసిరి. గతంలో నేనో, మావాళ్లో వాణ్ని చిన్నబుచ్చి ఉండొచ్చు. అది మనసులో పెట్టుకుని ఇప్పుడు పగ తీర్చుకుంటాడని నా భయం" అన్నాను.

"అవసరం లేకున్నా గ్రాడ్యుయేటై మీ అంతటి మీరు ఉద్యోగం సంపాదించినవారు మీరు. అవసరమై కష్టపడి చదివి మీవల్ల ఇంతవాడయ్యాడు ఉమేష్. కోరితే ఏదైనా సాధించగలిగిన మీరెక్కడ? మీ సాయంతో ఇంతవాడైన ఉమేష్ ఎక్కడ? మీరు తనకు స్నేహితుడని అతడు గర్వపడాలి. మీ ఆసరాతో ఇంతవాడయ్యాడని అతణ్ని చూసి మీరు గర్వపడాలి. భయపడతారేం?" అంది చంద్రిక వెంటనే.

చంద్రిక భారతనారి. గొప్పతనంలో ఆమెకు ఎవరైనా భర్త తర్వాతేనని గుర్తించినా ఆ మాటలు నాకు కొంత ఊరటనిచ్చాయి, 'కానీ వాడిప్పుడు నాకు బాస్. వాణ్ని చూసి గర్వపడినప్పుడల్లా నా స్థానం నన్ను చిన్నబుచ్చుతూంటుంది. ఉద్యోగానికి రాజీనామా చేసి-మనూరెల్లి వ్యవసాయం చేసుకునే మాటైతే రోజూ వాణ్ని తల్చుకుని గర్వపడొచ్చు" అన్నాను.

చంద్రిక ఒప్పుకోలేదు, "ఉద్యోగమొదిలేస్తే ఉమేష్‌మీద కుళ్లుకున్నారంటారు. మీకు చెడ్డపేరొస్తుంది. ముందెరుగని గంగారావే మిమ్మల్ని నెత్తిమీద నా నమ్మకం. అలా జరక్కపోతే అతడి ప్రవర్తన నచ్చలేదని అప్పుడే రాజీనామా చెయ్యొచ్చు.

పెట్టేది ఒదిలేస్తోంది" అంది. ఆ మాటలు నాలో ఏవేవో రేకెత్తాయి.

ఉన్నాదే కాదు. ఆస్తి హోదాయే! గంగారావు నాకున్న ఆ హోదానే గౌరవించాడు. మరి ఉమేష్ కైతే నా గురించి గంగారావుకంటే ఎక్కువ తెలుసు. గౌరవించక చస్తాడా? ఆ పైన వాడు మా ఆసరాతో పైకొచ్చాడన్న విషయం వాడు దాచినా నేను దాగనివ్వను. అప్పుడు ఆఫీసులో నేను వాడి పట్ల అతివినయం ప్రదర్శించినా కొలీగ్సు నామీద జాలిపడతారు తప్ప హేళన చేయరు. వాడు నాపట్ల రవంత దురుసుగా ప్రవర్తించినా అంతా వాణ్ని ఏవగించుకుంటారు.

నేనిలా ఆలోచిస్తే-ఉమేష్ ప్రవర్తన నా ఊహలకు పూర్తిగా భిన్నంగా ఉంది.

ఆ సాయంత్రం మా ఇంట్లో పరస్పర పరిచయాలవగానే, "పిల్లలేరమ్మా, చెల్లాయ్" అన్నాడు వాడు.

ఆ పలకరింపులోని ఆత్మీయతకు నేనే చెలించాను. ఆడది చంద్రిక కరిగిపోదూ-"ఇప్పుడే పక్కింటి పిల్లలు తీసుకెళ్లారు. మనమేం మాట్లాడుకున్నా వాళ్లొచ్చేలోగానే. వచ్చాక సందడంతా వాళ్లదే" అంది.

అప్పటికి మా పెద్దాడికింకా మూడు నిండలేదు. చిన్నాడు వాడికంటే ఏణ్ణర్థం చిన్న. పక్కింటి వాళ్లు ముచ్చటపడి తరచుగానే వాళ్లని తీసుకెడుతుంటారు. ఇద్దరూ ఎంత అల్లరంటే వాళ్లలా ముచ్చటపడ్డం కూడా మా అదృష్టాల్లో ఒకటని నాకనిపిస్తుంది.

కూర్చుని కాసేపు కబుర్లు చెప్పుకున్నాక కాఫీ తెస్తానంటూ చంద్రిక లేచింది.


నీ చేతి కాఫీ మరోసారి రుచి చూస్తాను కానీ- ఈ పూటకు మీరిద్దరూ నేను పెట్టే కాఫీ రుచి చూడాలి" అంటూ లేచాడు ఉమేష్. మా అతిథి-అందులోనూ నాకు బాస్ తనే కాఫీ కలుపుతానంటే కలవరపడి నేనూ, చంద్రికా వాణ్ని వారించబోయా.

"నువ్వేప్పుడూ వంటింట్లో మీ అమ్మకు సాయం చెయ్యలేదు. ఇప్పుడు మా చెల్లాయికీ సాయం చేస్తున్నావనుకోను. కాబట్టి నన్ను వారించే అర్హత నీకు లేదు. ఇది నేనూ మా చెల్లాయ్ చూసుకోవాల్సిన విషయం" అని మాటలతో నన్ను పక్కకి నెట్టేసాడు ఉమేష్. తర్వాత చంద్రికతో, "మా రఘు నీకు చెప్పాడోలేదో కానీ మా అమ్మ వంటకే బ్రతుకుతెరువు చేసుకుని నన్నింతవాణ్ని చేసింది. అందరికీ వంటచేసి పెట్టే ఆమెకు ఇంట్లోనైనా కాస్త విశ్రాంతినివ్వాలని నేను వంటింటిపనులన్నీ నేర్చుకున్నాను. వంట అప్పుడప్పుడే చేసినా కాఫీమటుక్కు ప్రతిరోజూ నేనే చేసేవాణ్ని. నా కాఫీని అమ్మ తెగ మెచ్చుకుని తనకు అలా పెట్టడం రావడం లేదనేది. అదెంత నిజమో ఈరోజు మీరు చెప్పాలి" అన్నాడు.

పెద్ద ఆఫీసరై కూడా తన తల్లి వంటమనిషని చెప్పుకునేందుకు వాడేమాత్రమూ ఇబ్బందిగా ఫీలవలేదు సరికదా- పనికట్టుకుని మరీ ఆ విషయం చంద్రికకు చెప్పాడు. వాడి అంతర్యం నాకర్థం కాలేదు.

ఉమేష్ కలిపిన నిజంగానే చాలా బాగుంది. "ఈ రుచి మరిగినవాళ్లకు మా కాఫీ నచ్చుతుంతా? అందుకే అన్నయ్య ఏదో వంకపెట్టి తనే కాఫీ కలిపాడు" అంది చంద్రిక నన్నే చూస్తూ. నేనూ ఏమైనా పొగడాలని గొంతు సవరించుకుంటే ఉమేష్ నవి, "కాఫీ నచ్చితే నేనెళ్లాక పొగుడుకోండి. ఇప్పుడు ఇంకెనా మాట్లాడుకుందాం" అన్నాడు.

కబుర్లు మొదలయ్యాయి. నేను వాడి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తూ అంతర్యాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉన్నానేమో ఎక్కువగా చంద్రికే మాట్లాడింది. అదీకాక ఆమెకు వాడు కొత్తఙత మనిషనిపించినట్లు లేదు. చనువుగా తన చిన్ననాటి ముచ్చట్లు చెప్పింది. వాటిలో కొన్ని నాక్కూడా తెలియవు. మాట్లాడడమే కాదు, మాట్లాడించడమూ ఒక కళేనని అప్పుడు నాకు తెలిసింది.



తనం సంసారం ముచ్చట్లు చెబుతూ చంద్రిక తన అత్తమామ్మల్ని తెగ పొగుడుతూంటే-ఉమేష్ ఆమెను మధ్యలో ఆపి, "నీ పాయింట్సుకి జాయింట్సు చెల్లాయ్" అంటూ ఒకప్పుడు తామెంతటి దీనస్థితిలో ఉండేవారో, అప్పుడు మా కుటుంబం వాళ్లనెలా ఆదుకుందో వివరించాడు. నాకాశ్చర్యమేసింది. నా మటుక్కు నేను నాకలాంటి చరిత్ర ఉంటే దాచడానికే ప్రయత్నిస్తాను. చంద్రికా ఇబ్బందిపడి, "మీరు కబుర్లు చెప్పుకోండి, ఏ క్షణంలోనైనా పిల్లలు రావచ్చు. నేను వంట మొదలెడతాను" అంటూ లేచింది.

ఉమేష్ నవ్వి, "మా కబుర్లు ఆఫీసులో అయిపోయాయి. ఇంకా ఏమైనా ఉంటే రేపు మళ్లీ ఆఫీసులో మాట్లాడుకుంటాం. కాఫీని పొగిడారు కదా-మరి నా వంటనూ పొగిడించుకోవాలనుంది" అంటూ తనూ లేస్తే చంద్రిక తల అడ్డంగా ఊపి, "మరి నేను నా వంటను పొగిడించుకోవద్దా?" అంది. వాడు వెంటనే, "ఐతే అసలు విషయం చెప్పక తప్పదు. సేవకుడిలాంటి నన్ను తమతో సమానంగా చూడ్డం మీవాళ్ల సంస్కారం. కానీ నాకుమాత్రం మీవాళ్లకు సేవలు చేయడంలోనే తృప్తి, సంతోషం ఉండేవి. ఇప్పటికీ మీ ఇంటిపట్ల నా దృక్పథం మారలేదు. నువ్వంతగా వద్దంటే నేను పై పనులే చేస్తాలే. నాకా పాత రోజుల తీపి జ్ఞాపకాలను అనుభవంలోకి తెచ్చుకునే అవకాశ మివ్వు" అన్నాడు. చంద్రిక ఇబ్బందిగా నవ్వి లోపల కెళ్లింది.

తెల్లబోయాను. ఉమేష్ స్థితప్రజ్ఞుడా లేక నా కాంప్లెక్సు గ్రహించి పోగొట్టే ప్రయత్నం చేస్తున్నాడా అని ఆలోచిస్తూంటే- వాడు నా చేయి పట్టుకుని, "కొత్త కాబట్టి ఇప్పుడు నువ్వూ నాతో రావాలి. ముమ్ముందు ఇలాంటి పనుల్లో నాకు నీ అవసరముండదులే" అంటూ తనూ వంటింట్లోకి దారి తీసాడు. అక్కడ ఆమెనడిగి తెలుసుకుని ఉన్న పనులు అంచాన వేసి- తన వంతుగా తరగడానికి వంకాయలు, ఉల్లిపాయలు తీసుకున్నాడు. చంద్రిక ఇంకా నొచ్చుకుంటుంటే, 'ప్లీజ్! నేను అతిథిని కాను. మీ మనిషిని" అన్నాడు.

వంటింటి పనులు నాకలవాటు లేవు. కానీ ఉమేష్ నాకు బాస్. అందుకని తప్పనిసరై, "నువ్వేందుకూ అవసరమైతే నేను తరుగుతానుగా" అన్నాను.


"నువ్వు చేస్తాననే నేను నిన్నిలాంటి పనులు చేయనిస్తానా?" అంటూ చంద్రికవైపు తిరిగి, "చెల్లాయ్! నీకెప్పుడవసరపడినా నాకో ఫోన్ కొట్టు. అంతేకానీ మా రఘుకిలాంటి పనులు చెప్పకు. వాడు రాయల్ పనులు చేయడానికే పుట్టాడు. తెలిసిందా?" అన్నాడు.

"ఏమిటన్నయ్యా-నువ్వు గతాన్ని తప్పుతూ వర్తమానాన్ని మర్చిపోతున్నావు. ఆయన్ను రాయల్ రాయల్ అంటున్నావుకానీ-ఆఫీసులో ఇప్పుడు నువ్వాయనకు బాస్ కదా!" అంది చంద్రిక. అనుకున్నంతా అయింది. సంబాషణలో మా ఇద్దరి హోదాలకూ ఎక్కడ పోలిక దొర్లుతుందోనని బెంగగా ఉన్న నాకు-ఆ పోలిక నా అర్థాంగి నోటనే వినబడేసరికి మనసు కలుక్కుమంది. ఆ వెంటనే చంద్రికనోట ఆ మాటనిపించేలా-ఉమేష్ సంభాషణను నడిపాడని కూడా అనిపించింది. ఐతే ఉమేష్, "శ్రీకృష్ణుణ్ని దేవుడని అర్జునుడు కూడా నమ్మాడు. కానీ కురుక్షేత్రంలో రథాన్నెక్కిందెవరు? తోలిందెవరు? హోదాలు బాధ్యతల్నే తప్ప వ్యక్తిత్వాల ఔన్నత్యాన్ని నిర్ణయించవు" అన్నాడు.

చంద్రిక ముఖం ఇంతయింది. "అమ్మో-నీతో మాట్లాడ్డం చాలా కష్టం" అందామె అంగీకారసూచకంగా. నేను మాత్రం వాడి వ్యాఖ్యను గతానికి అన్వయించి తనే శ్రీకృష్ణుడని అన్నట్లు ఫీలయ్యాను.

అంతలో పక్కింటివాళ్లు మా పిల్లల్ని మాకప్పగించి వెళ్లారు. అది అనువుగా తీసుకుని, ఐతే నువ్వూ ఆయనా కలిసి పిల్లల్ని ఎంగేజ్ చేయండన్నయ్యా! చిటికెలో వంట పూర్తి చేసేస్తాను" అంది చంద్రిక.

మా పిల్లలు నాకు ముద్దే. ఐనా వాళ్లతో ఆడుకోగలను కానీ వాళ్లనాడించలేను. రెండింటికీ ఉన్న తేడా పిల్లలున్నవారికే తెలుస్తుంది. ఆ మాటంటే, "పిల్లలు విషయంలో-ఆడించినా ఆడుకున్నా సేవాధర్మం పాటించినప్పుడే సరదాగా ఉంటుంది. అది నాకు తెలిసినట్లు నీకెలా తెలుస్తుంది?" అంటూ తీరు ప్రేక్షకుడిగా నాకు కలిగించిన రసానుభూతి వర్ణనాతీతం. పిల్లలు వాడికి త్వరగా చేరిక కావడమే కాదు, పెంకి ఘటాలనుకున్న వాళ్లు వాడేం చెబితే



అది చేసారు. వాడి ధర్మమా అని మొదటిసారిగా పిల్లలతో కలిసి భోంచేసాం మేమారోజు.

పిల్లలూ, ఇల్లాలూ తనను మెచ్చారని వాడు నన్ను చిన్నబుచ్చలేదు. చిన్నప్పటిలాగే ఇప్పుడూ నామీద ఈగ వాలనివ్వలేదు. అది తాత్కాలికం కూడా కాదని క్రమంగా గ్రహించాను. చేద్దాంఫీసులో వాడు హోదాలను నిరసించి స్టాఫందర్నీ సంఘటితం చేసాడు. "ఇక్కడ ఎవరి పనులు వాళ్లు చేస్తున్నాం. ఎవరూ ఎవరికీ బాస్ కాదు. అంకితభావంతో అంతా కలిసి కంపెనీ బాగుకై కృషి చేద్దాం" అంటూ వాడు- నేను ప్రచారం చేద్దామనుకున్న తన గతాన్ని తనే స్టాఫుకి వినిపించాడు. దాంతో స్టాఫ్ వాణ్ని ఓ మంచి స్నేహితుడిగా భావించారు. గంగారువున్నప్పుడు స్టాఫ్‌కి బాస్ అంటే గౌరవంతోపాటు భయముండేది. ఉమేషంటే అందరికీ చెప్పలేనంత గౌరవమున్నా భయం మాత్రం లేదు. భయమంటూ ఉంటే అది నేనంటేనే. ఉమేష్ నామీద ఈగవాలినా సహించడని స్టాఫ్‌కి అంతలా నమ్మకం కుదిరింది మరి!

అయినా నాకు సంతోషంగా లేదు. కారణం అంతుబట్టడంలేదు కానీ ఉమేష్ నాకిచ్చే విలువ నన్ను అవమానానికి గురిచేస్తోంది. అది భార్యక్కూడా చెప్పుకోలేని అసహాయుణ్ణై సంతోషాన్ని నటిస్తున్నాను. నేను మర్యాదకు మాత్రమే ఉమేష్‌పట్ల స్నేహభావాన్ని ప్రదర్శిస్తున్నాన్న విషయమూ చంద్రికకు తెలియదు.

నాకు ఉమేష్ అర్థం కావడంలేదు. గతంలో తక్కువతనాన్ని దాచుకోడు. వర్తమానంలో హోదాకి గొప్పచేయడు. అయినా వాడి నవ్వు నిర్మలం. వాడి ముఖంనిండా సంతోషం. వడ్డించిన విస్తరిలాంటి జీవితమున్న నేనెప్పుడూ అంత సంతోషంగా ఉన్నట్లనిపించదు. వాడు స్థితప్రజ్ఞుడా లేక మహానటుడా?

ఉండబట్టలేక ఒకసారి అడిగేసాను తన సంతోషరహస్యం చెప్పమని. వాడు నవ్వి, "మార్పుకోసమైనా అప్పుడప్పుడు బాధపడాలని- కారణాలు వెతుకుతూంటాను. సరైనదొక్కటీ దొరక్క సంతోషం రెట్టింపౌతోంది. అదే నా సంతోరహస్యం" అన్నాడు.

నేనెందుకు సంతోషంగా ఉండకూడదూ అని నన్ను నేను ప్రశ్నించుకున్నా సరైన కారణమొక్కటీ దొరకదు. వాడి మాటల్లో సంతోషానికి సంబంధించి గొప్ప వేదాంతముందని గుర్తించాను కానీ తెలిసినది అమలు చేయడం మహాత్ములకు మాత్రమే సాధ్యమని సరిపెట్టుకున్నాను.

అయితే ఉమేష్ మహాత్ముడనీ ఒప్పుకోలేను. కానీ వాడి ఔన్నత్యమూ, సంతోషమే నా బాధకు కారణమని తెలుసు. అది బేసబబైనా అసహజమూ కాదని సరిపెట్టుకుంటాను. వాడి ఔనత్యాన్ని దిగజార్చాలంటే వాడి గతాన్ని బయటపెట్టాలి. కానీ అది తనే బయటపెట్టి వాడు తన ఔనత్యాన్ని మరింతగా పెంచుకున్నాడు. ఇక మిగిలింది వాడి సంతోషం. దాన్ని హరిస్తే నా మనసుకు కాస్త ఊరట కలగొచ్చు. అనుకోకుండా ఆ అవకాశాన్ని చంద్రికే నాకిచ్చింది. భార్యను అర్థాంగి అని ఊరికే అన్నారా మరి!

చంద్రిక ఉమేష్ అంటే ఎంతగా ఇంప్రెస్ అయిందంటే- తనే చొరవచేసి వాడికి సంబంధాలు చూస్తూ- తన. పినతల్లి కూతురు గిరిజకు ఆ సంబంధం చెప్పింది. ఉమేష్ హోదా నచ్చిన గిరిజ తల్లిదండ్రులు వాడి తల్లి వంటమనిషైనా ఫరవాలేదనుకున్నారు కానీ కొన్ని ఆరాల తర్వాత వాళ్లకు జగదాంబ చరిత్ర మంచికాదని తెలిసింది. ఆమె విశాఖపట్నంలో మిఠాయి దుకాణం తెరిచినప్పట్నించీ ఓ వివాహితుడికి ఉంపుడుగత్తెగా ఉంటోంది. ప్రియుడామెను వదలకపోవడంవల్లనే ఆమె ఇంకా కొడుకు దగ్గరకు రాలేకపోతోంది. ప్రస్తుతానికి మకాం హైదరాబాదుకు మార్చడానికి ప్రియుణ్ని ఒప్పించే ప్రయత్నంలో ఉంది.

"కుర్రాడు బుద్ధిమంతుడేనని అంతా అంటున్నారు. పెళ్లయ్యాక తల్లిని దూరంగా ఉంచుతానని మాటిస్తే ఈ సంబంధం చేసుకోవచ్చు" అంటే పినతల్లి చంద్రికకు ఫోన్ చేసింది.

ఈ వార్త చంద్రికకు పెద్ద షాక్. ఆమె జగదాంబపై అభాండం వేసినవాళ్లనీ, అది నమ్మిన పినతల్లి కుటుంబాన్నీ తిట్టి, "నిజం వాళ్లకు తెలియదనుకోను. ఇప్పట్నించీ కూతురికి అత్తపోరు తప్పించే పాడుబుద్ధి కాకపోతే- అబ్బాయి నచ్చాడు కానీ అతణ్ని కన్నతల్లి పనికిరాదుట" అంటూ నా దగ్గర గొణిగింది.

వార్త విని ముందు నేనూ షాక్ తిన్నాను. జగదాంబపై ఇలాంటి ప్రచారమున్నట్లే నాకు తెలియదు. గిరిజ తలిదండ్రులీ వివరాలెలా సేకరించారో కానీ-జగదాంబ వాటిని కొడుక్కి కూడా తెలియ కుండా దాచి ఉండాలి. లేకుంటే ఉమేష్ తల్లినంతగా గౌరవించడు. గౌరవించినా తనం త సంతోషంగా ఉండలేడు. తల్లి శీలవతి కాదని తెలిసి-ఆమెనసహ్యించుకుని తమలో తాము కుమిలిపోయూవాళ్లు కొందరు నాకు తెలుసు.

ఇది తెలిస్తే ఉమేష్ కృంగిపోతాడు. అప్పుడు నేను వాడిమీద జాలిపడతాను. అవగాహనతో చేయూతనిస్తాను. వాడు నాకిస్తున్న గౌరవానికి ప్రతిఫలమిచ్చి సంతోషంగా ఉంటాము.

ఇవన్నీ మనసులో ఉంచుకుని, "ఈ విషయం ఉమేష్‌తో మాట్లాడదాం. అపార్థాలుంటే మొగ్గలోనే త్రుంచేయాలి. ఇంత మంచి సంబంధం గిరిజకు కాకుండా పోనివ్వకూడదు" అన్నాను చంద్రికతో.

ఓ రోజు ఉమేష్‌ని మా ఇంటికి పిలిచాం. ఆ కబురూ ఈ కబురూ చెప్పాక నేనే గిరిజ సంబంధం గురించి చెప్పి, "వాళ్లు మీ అమ్మగారి గురించి తప్పుగా విన్నారుట" అన్నాను.

ఉమేష్ చలించలేదు, "ఏం విన్నారో సంకోచించకుండా చెప్పు" అన్నాడు నవ్వుతూ. నేను తటపటాయిస్తూ, "నానోటితో నేను చెప్పలేను. నువ్వే అర్థం చేసుకుని ఈ విషయంలో నువ్వు చెప్పేదేమైనా ఉంటే చెప్పు. నువ్వేం చెప్పినా నేను నమ్ముతాను" అన్నాను. ఆ క్షణంలో నాది వాడికంటే పైచేయి అనిపించిందేమో ముఖంలో దాచిన సంతోషం గొంతులో దాగలేదు.

ఉమేష్ తేలిగ్గా నవ్వి, "అమ్మను దూరంగా ఉంచుతానంటే నాకు పిల్లనివ్వడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారు. ఇంకా చెప్పాలంటే నా పెళ్లికోసమే అమ్మ నాకు దూరంగా ఉంటోంది. అందుకే అమ్మకు నేను చెప్పేసాను- నా పెళ్లి బాధ్యత తనదేనని" అన్నాడు.

వాడికి విషయం కొంతైనా తెలుసని స్పష్టం కావడంతో నేను మరి కాస్త చొరవచేసి, "నిప్పు లేకున్నా పొగ వచ్చే రోజులివి. అమ్మలో తప్పు లేకపోతే ఆ విషయం ఋజువు చేద్దాం. అమ్మలో తప్పుంటే ఆడపిల్లనిచ్చుకునేవారి షరతులో న్యాయముందని ఒప్పుకోవాలి" అన్నాను.

ఉమేష్ వెంటనే, "రాముడు సీతను అగ్నిపరీక్షకు గురిచేసి ఆ పైన అడవికి పంపాడు. కృష్ణుడు గోపికలకు వస్త్రాపహరణం చేసాడు. శ్రీనివాసుడికి ఇద్దరు భార్యలు. జీసస్ కన్యకు పుట్టాడు. వ్యక్తులుగా కాక దేవుళ్లని భావించడం వల్లనే మనం తప్పులెంచక వాళ్లను భక్తితో కొలుస్తున్నాం. చిన్న వయసులోనే నాన్నపోతే ఒంటరి ఆడదానిగా అమ్మ ఎలాంటి అనుభవాలకూ, అనుభూతులకూ గురైందో నాకు తెలియదు. నీడనిచ్చిన మీ నాన్న ఆమెలో తోడును చూసాడని మీ అమ్మ అనుకోవడమే-మేము మీ ఇల్లు వదలడానిక్కారణమని నీకు తెలుసో తెలియదో నాకు తెలియదు. విశాఖపట్నంలోనూ అమ్మ గురించి నలుగురూ నానారకాలుగానూ అనుకునేవారు. మరెన్ని పేర్లు వీధికెక్కుతాయన్న భయంతోనో ఏమో ఎవ్వరూ ఎదుటపడి ఆమెనేమీ అనలేదు. ఏదేమైనా సమాజానికి బదులిచ్చుకోవడం-వ్యక్తిగా ఆమె బాధ్యత అని నేనూ ఒప్పుకుంటాను. నాకు సంబంధించినంతవరకూ ఆమె దేవత. వ్యక్తిగా ఆమె ఏంచేస్తోందనికాక భక్తితో ఆమెను కొలుచుకోవడంలో నాకానందముంది. కొడుకు మాతృదేవతను శీలం విషయమై నిలదీయడం నీచమని నా అభిప్రాయం" అన్నాడు.

అవి మాటలు కావు. అపూర్వమైన వ్యక్తిత్వంలోంచి పుట్టుకొచ్చిన సుభాషితాలు. తల్లిని కించపరిచే బూతుపదాలను- ప్రత్యర్థి ఆవేశాగ్నికి ఆజ్యంగా వాడే కుసంస్కారానికి చెప్పు దెబ్బలు వ్యక్తిత్వాన్ని వ్యక్తినుంచి వేరుచేసి చూడగలగడం అదే నాకు మొదలు. అప్రయత్నంగా నేను ఉమేష్‌ముందు ప్రణమిల్లాను. ఆ తర్వాత చంద్రికతో, "ఉమేష్ నిత్యసంతోషానికి కారణం నాకిప్పుడు తెలిసిందిం. వాణ్ని సంతోషం నుంచి దూరం చేయాలనుకునేసరికి ఫెయిల్యూర్ తప్పదు. వాణ్ని సంతోషంగా ఉంచాలనుకున్నవాళ్లు తామూ సంతోషంగా ఉండగల్గుతారు. గిరిజ చదువు కున్నది. అర్థం చేసుకుంటుందేమో-ఆమెకీ విషయం చెప్పు" అన్నాను.

ఆ తర్వాతనుంచి అమ్మంటే నాకు గౌరవమని చెప్పుకుందుకు సిగ్గు పడుతున్నాను. ఉమేష్ మాతృభక్తి గురించి తెలిసాక నేనేకాదు ఎవరైనా అంతేనేమో!